క్రీడామైదానాలు కరువు

- సర్కారు బడుల్లో కానరాని ఆటలు
- అమలుకు నోచుకోని జీవో 63
- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు



ఆట స్థలం లేని తాంసి ఆశ్రమ పాఠశాల

తలమడుగు: జీవోలు జారీ చేయడమే తప్పా.. వాటి అమలు, పర్యవేక్షణపై అటు ప్రభుత్వాలు, ఇటు అధికారుల్లో చిత్తశుద్ధి ఉండడం లేదు. విద్యార్థుల సమగ్ర వికాసం కోసం వ్యాయామ విద్య, క్రీడలు, నైతిక విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం గతంలో జీవో నంబర్ 63 విడుదల చేసింది. ప్రతీరోజు ఒక పిరియడ్ వ్యాయామ విద్యకు కేటాయించాలని అప్పటి సెకండరీ విద్య ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. కానీ క్షేత్రస్థాయిలో అవసరమైన పీఈటీ, పీడీలు లేకపోవడంతో అమలుపై సందేహాలు వ్యక్తం చేశాయి. పోస్టుల భర్తీ విషయంలో ఊసెత్తని ప్రభుత్వం ప్రస్తుతానికి సర్దుబాటు చేసుకోవాలని, త్వరలో పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంత పోస్టులు భర్తీ చేయలేదు. తాంసి, తలమడుగు, భీంపూర్ మండలంలో మొత్తం 107 పైగా ప్రభుత్వ యజమాన్య పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 16 మంది పీఈటీలు మాత్రమే ఉన్నారు.

ఆట స్థలాలు, క్రీడా సామగ్రి ఎక్కడ..

తాంసి, తలమడుగు, భీంపూర్ మండలంలో మొత్తం 107 పాఠశాలలు ఉన్నాయి. తలమడుగు మండలంలో 4605 మంది విద్యార్థులు, తాంసి, భీంపూర్‌లో 5900 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో సగానికి పైగా పాఠశాలలకు ఆట స్థలాలు లేవు. దీంతో విద్యార్థులు వ్యాయామ విద్యకు దూరమౌతున్నారు. విద్యార్థులే క్రీడా సామగ్రిని ఇంటి నుంచి తెచ్చుకుని ఆడుకుంటున్నారు. క్రీడలకు ప్రత్యేక బడ్జెట్ కూడా విడుదల కాకపోవడంతో క్రీడలు మరుగునపడుతున్నాయి.

క్రీడల్లో వెనుకబాటు..

ప్రతి విద్యార్థికీ చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం. కేవలం చదువుపై ధ్యాస పెడుతున్న విద్యార్థులు ఆరోగ్యపరంగా ఎంతగానో నష్టపోతున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని చాలా మంది ప్రధానోపాధ్యాయులు వారికి ఆటలు ఆడిస్తున్నారు. పీఈటీలు, పీడీలు లేకపోవడంతో పాఠశాలల్లో ఉన్న సబెక్టు టీచర్లను నియమిస్తున్నారు. కానీ ఆటల్లో నియమ నిబంధనలు, రక్షణ చర్యలు తెలియకపోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడా మైదానంలో వదిలేస్తున్నారు. దీంతో ఇష్టం వచ్చినట్లు విద్యార్థులు ఆడుకుంటున్నారు. కొన్ని పాఠశాలలో క్రీడామైదానాలు ఉన్నప్పటికీ పీఈటీలు లేరు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలలో మౌలిక వసతులు, క్రీడా మైదానాలు, పీఈటీలను పూర్తిస్థాయిలో నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోస్టులు భర్తీ చేస్తాం

గత ఏడాది కాంట్రాక్టు పద్ధతిలో మండలంలో ఉన్నత పాఠశాలల్లో ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీలను నియమించాం. వారు ఈ విద్యా సంవత్సరం పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. మిగితా పాఠశాలల్లో పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

– నారాయణ, ఎంఈవో

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే జోగు రామన్న



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ కాలనీలో గల దిణాముఖి హనుమాన్ ఆలయంలో శనివారం నిర్వహించిన రామాయణ పారాయణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే ధూపదీప నైవేద్య పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఆలయ అభివృద్ధికి సభ్యులుగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, ఆలయ కమిటీ నాయకులు మేఘరాజ్ శర్మ, కిరణ్ కుమార్, పసుపుల రాజు పాల్గొన్నారు.

సంఘం అభ్యున్నతికి పాటుపడాలి

ఆదిలాబాద్‌రూరల్: కుల సంఘాల సభ్యులు ఐక్యంగా ఉంటూ సంఘం అభ్యున్నతికి పాటుపడాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తాలూకా మున్నూరు కాపు సంఘ భవనంలో క్యాలెండర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాలూకా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కాళ్ల విఠల్, ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, కోశాధికారి కైపెల్లి జైపాల్, ఎంపీపీలు గంద్రత్ రమేష్, మర్శెట్టి గోవర్ధన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత పాల్గొన్నారు.

పెటా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్: వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (పెటా) టీఎస్ క్యాలెండర్‌ను శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జోగు రామన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెటా టీఎస్ ఆదిలాబాద్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోరెడ్డి పార్థసారథి ఎస్. స్వామి, కోశాధికారి జె. సాయి కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు గుండి మహేష్, కృష్ణ, అశ్వత్ రెడ్డి, రాజేష్, నాందేవ్ పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారిగూడలో గల మైనార్టీ గురుకులంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమితులైన పలువురికి ఎమ్మెల్యే జోగు రామన్న శనివారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాహీర్ రంజాని, దుర్గంట్రస్టు చైర్మన్ దుర్గం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రామన్న

కైలాస్‌నగర్: మన ఊరు.. మన బడి కింద చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యార్థుల ఇబ్బందులను తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈకార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. మొదటి విడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, డీఈవో టి.ప్రణీత, పీఆర్ ఈఈ మహావీర్, మున్సిపల్ ఏఈ అరుణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

- జిల్లా సహకార కార్యాలయంలో ఫిర్యాదు



ఆదిలాబాద్ సహకార కార్యాలయం వద్ద డైరెక్టర్లు

నేరడిగొండ: నేరడిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా సాబ్లే కిషోర్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే పీఏసీఎస్ పరిధిలోని 8 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాణం విషయమై శనివారం ఆదిలాబాద్ జిల్లా సహకార కార్యాలయ సూపరింటెండెంట్ ఆత్మారాంకు ఫిర్యాదు చేశారు. పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లు కాగా, కిషోర్ 8 మంది డైరెక్టర్లతో చైర్మన్‌గా నియమితులయ్యారు. అయితే ఈసారి ఆడె వసంత్‌రావు వైపు 8 మంది డైరెక్టర్లు కలిసి ఆదిలాబాద్‌లో తీర్మానం విషయం వెళ్లారు. దీంతో నేరడిగొండలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ పరిణామం ఎటు దారి తీస్తుందో వేచిచూడాలి. ఏదేమైనా ఈసారి చైర్మన్‌పై వ్యతిరేక పవనాలు వీయడంతో గతంలో మద్దతు తెలిపిన కొంతమంది డైరెక్టర్లు వసంత్‌రావు వైపు రావడంతో ఆసక్తి నెలకొంది.

కరువు భత్యం విడుదల చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు కరువు భత్యం విడుదల చేయాలని రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయ బీజేపీ విభాగం అధ్యక్షుడు నల్ల రత్నాకర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పదోన్నతులు చేపట్టాలన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు

బేల: మండలంలోని పాటన్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ ఫైజుల్లాఖాన్ క్రీడపరికరాలు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధాయ్యులు మయకర్, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం ఆవిష్కరించారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, కిష్టయ్య, సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి




రైతులతో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: పత్తి ధర రోజు రోజుకూ పడిపోతున్న క్రమంలో పత్తికి గిట్టుబాటు ధర కోసం అఖిల పక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిల పక్ష రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ, రామాయి, తంతోలి, అంకోలి, కచికంటి, భీంసరి, చాందా (టి) గ్రామాల్లో పర్యటించారు. రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి మాట్లాడుతూ.. పత్తి పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఆరోపించారు. సీసీఐ మార్కెట్‌లో పోటీపడి పంటలు కొనుగోలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండ రమేష్, విజ్జగిరి నారాయణ, దేవిదాస్, లోకారి పోశెట్టి, వినోద్, జగదీశ్, స్వామి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ఉట్నూర్: టీయూడబ్ల్యూజేహెచ్– 143 ఆధ్వర్యంలో ఈనెల 8నుంచి 10 వరకు నిర్వహించే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజేహెచ్ జిల్లా అధ్యక్షుడు బేత రమేశ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ప్రెస్‌భవన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, 23 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఉట్నూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాడి మల్లేష్, జావీద్, జర్నలిస్టులు సయ్యద్ కరీం, సుదర్శన్, రవి, అదీల్ పాల్గొన్నారు.

ఘనంగా నాందేవ్ కాంబ్లే జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మాజీ డీసీసీబీ చైర్మన్ దివంగత నేత నాందేవ్ కాంబ్లే 77వ జయంతిని శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిత్యం సమాజ శ్రేయస్సు కోసం ఆలోచించే వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ యూనుస్ అక్బానీ, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, బండారి దేవన్న, కాంబ్లే ఉద్ధవ్, ప్రజ్ఞాకుమార్, డికె నాందేవ్, సూర్యకాంత్, వాసుదేవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్యులను నియమించాలని వినతి

బోథ్: బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను నియమించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజనాల రవీంద్రప్రసాద్ శనివారం కలిసి విన్నవించారు. ఇదివరకు ఆసుపత్రిలో విధులు నిర్వర్తించిన ఐదుగురు వైద్యులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారని పేర్కొన్నారు. వెంటనే ఇద్దరు వైద్యులను డిప్యూటేషన్‌పై నియమిస్తామని హామీ ఇచ్చినట్లు రవీంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 15 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తం 40 సీట్లకు గాను మైనార్టీలకు 26, క్రిస్టియన్ మైనార్టీలకు 2, ఇతర మైనార్టీ వర్గాలకు 2, ఎస్సీలకు 02, ఎస్టీలకు 2, ఓసీ 1, బీసీలకు 5 చొప్పున రిజర్వేషన్ పద్ధతిలో సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. వివరాలకు 79950 57873 సంప్రదించాలని కోరారు.

దర్గా స్థలం సర్వే

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) గ్రామ శివారులోని దర్గా స్థలాన్ని రెవెన్యూ అధికారులు శనివారం సర్వే చేశారు. ఈసందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షుడు ఆష్రఫ్ మాట్లాడుతూ.. చాందా (టి) శివారులో 90, 92, 93, 103 సర్వే నంబర్‌లలో దర్గాకు సంబంధించి 54 ఎకరాల స్థలం ఉందన్నారు. అందులో 15 ఎకరాలలో దర్గా ఉందన్నారు. మిగిత స్థలం కబ్జాకు గురైందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్, దర్గా ముజావార్‌లు చాహిన్, అఫ్సార్ పాల్గొన్నారు.

బస్టాండ్ స్థలం కబ్జాకు గురి కాలేదు

బోథ్: బోథ్ బస్టాండ్ స్థలం కబ్జాకు గురికాలేదని ఆర్టీసీ డీఈ ఆంజనేయులు, ఏఈ వికాస్, ఆర్ఎం జానీరెడ్డి, డీఎం సాయన్నలు తెలిపారు. శనివారం బస్టాండ్‌ను పరిశీలించారు. మొత్తం స్థలాన్ని కొలిపించారు. త్వరలో బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ యాదవ్, వీడీసీ అధ్యక్షుడు గట్ల గంగాధర్, కంట్రోలర్ సాయన్న పాల్గొన్నారు.


భగవాన్‌బాబా చూపిన మార్గంలో నడవాలి



జయంతిలో పాల్గొన్న నాయకులు

ఇంద్రవెల్లి: వంజరి సమాజ్‌కు భగవాన్‌బాబా చూపిన మార్గంలో నడవాలని పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె అన్నారు. మండల కేంద్రంలోని వంజరి సమాజ్ ఆధ్వర్యంలో వంజరి సమాజ్ కుల గురువు శ్రీసంత్ భగవాన్‌బాబా 58వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మారుతి మహరాజ్, బాబు ముండే, సంజయ్, కేశవ్ ముస్లే, నారాయణ, రాజేశ్వర్, కనక తుకారం, దేవిదాస్, విశ్వనాథ్, ప్రకాష్, సంబాజీ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి



పాఠశాలను తనిఖీ చేస్తున్న జీసీడీవో

నార్నూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని జీసీడీవో ఛాయ అన్నారు. శనివారం మండలంలోని జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణంలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, పీఈడీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకృప దినోత్సవానికి తరలిరండి

నేరడిగొండ: 44వ గురుకృప దినోత్సవానికి తరలిరావాలని గిరిజన లంబాడాల ఐక్యవేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. మండలంలో శనివారం మాట్లాడారు. నార్నూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శ్రీసంత్ సేవాలాల్ దీక్ష భూమి జాతరకు 28 రాష్ట్రాల నుంచి బంజారా, లంబాడా ప్రజలు, సేవాలాల్ మహరాజ్ భక్తులు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో గిరిజన లంబాడాల ఐక్యవేదిక జిల్లా ఇన్‌చార్జి చవాన్ సేవాదాస్, రాథోడ్ పాండు, సచిన్, అరవింద్ పాల్గొన్నారు

అటెన్షన్ ప్లీజ్.. నిర్మాణం పూర్తికాని అంగన్‌వాడీ



బేల: మండలంలోని గణేష్‌పూర్ గ్రామంలో ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.15లక్షల వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణ పనులు రెండేళ్లుగా కొనసాగుతున్నాయి. గోడలు ప్లాస్టరింగ్ పనులు చేస్తున్నారు. ఫ్లోరింగ్, కలరింగ్, విద్యుదీకరణ ఇంకా పూర్తికావాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు

– సంబంధిత అధికారి: సుధాకర్, ఐటీడీఏ ఏఈ, ఫోన్: 72826 27394

అనేక సంక్షేమ పథకాలు అమలు



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీచైర్మన్

నార్నూర్: దేశంలోనే ఎక్కడా లేని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శనివారం జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 48 మందికి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పని చేసే ప్రభుత్వాలను ప్రజలు గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఎంపీటీసీ పరమేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, తహసీల్దార్ దుర్వా లక్ష్మణ్, కనక ప్రభాకర్, కొర్రెళ్ల మహేందర్ పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలం'



జెండా ఆవిష్కరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని అర్లి (బి)గ్రామంలో శనివారం సీపీఐ గ్రామశాఖను నియమించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు ఇచ్చి, అమాయకపు ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాయన్నారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచుతూ ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కుంటాల రాములు, సురేష్, పోచ్చిరాం, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జెడ్పీ చైర్మన్‌కు సన్మానం

కైలాస్‌నగర్: జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌ను సీనియర్ సిటీజన్ ఫోరం ప్రతినిధులు శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శులు వామన్‌రావు, రాంకులకర్ణి, పి.సత్యనారాయణ, కిషన్, భాస్కర్ పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులకు..

కైలాస్‌నగర్: టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్.అశోక్, అనిల్ కుమార్‌లను టీజీవో జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాం నాయక్ శనివారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్‌సింగ్‌కు..

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ నియమితులైన రుక్మణ్ సింగ్‌ను సొనాల సర్పంచ్ చెట్లపెల్లి సదానందం ఆధ్వర్యంలో శనివారం పాలకవర్గం ఘనంగా సన్మానించారు. సొనాల సబ్ మార్కెట్‌యార్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే బాపురావు దృష్టికి తీసుకెళ్లి సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామాయి గంగామణి, వార్డు సభ్యులు గుద్రాలతండా సర్పంచ్ సకారాం, ఐటీడీఏ డైరెక్టర్ భూమన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సత్యనారాయణ, గాండ్ల నారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ తుకారాంకు..

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన మెస్రం తుకారాంను టీఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. నాగోబా చైర్మన్‌గా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, ఎంపీటీసీ కోవ రాజేశ్వర్, దేవ్‌పూజే మారుతి, పోటే సాయినాథ్, సుంకట్‌రావ్, కనక హనుమంత్‌రావ్, సుంగు పటేల్, కుమ్ర రాంషావ్, శివాజీ, బాబు ముండే పాల్గొన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నిక

బేల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) నూతన చైర్మన్, వైఎస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన చైర్మన్‌గా యమలివార్ మమత, వైస్ చైర్మన్ రాసేకార్ కిశోర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోల నర్సింలు, ఉపాధ్యాయులు రావుత్ రాజ్‌కుమార్, మనోజ్ చంద్రసేన్ పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సోదరుడు బిక్కునాయక్ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి పరామర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇచ్చోడ: మండలంలోని బోరిగామ గ్రామంలో శనివారం ఆదిలాబాద్ మాజీ ఎంపీ గోడం నగేష్ పలువురిని పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ జంగిలి గంగాన్న, అనారోగ్యంతో బాధపడుతున్న ఇచ్చోడ మాజీ సహకార సంఘం చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డిలను పరామర్శించి, వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు.

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన చిలుకురి నారాయణరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి శనివారం కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బాబుఖాన్, సంతోష్, ప్రకాష్‌రావు, గంగన్న, విఠల్, సంజీవ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ను పరిష్కరించాలని వీబీఏ పార్టీ జిల్లా అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. శనివారం ఆర్డీవో కదం సురేష్‌ను కార్యాలయంలో కలిసి సమస్యలపై విన్నవించారు. ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్‌లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రాజునా యక్, పవార్ తిరుపతి, విలాస్, భీంరావ్ పాల్గొన్నారు.

సమాచారం

నేడు యూటీఎఫ్ సమావేశం

ఆదిలాబాద్‌టౌన్: టీయూటీఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేడు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కార్యవర్గ ఎన్నిక

నేరడిగొండ: నేరడిగొండ మండల విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకోనున్నట్లు సంఘం బాధ్యులు శ్రీరామోజు నారాయణ, రాములు, వెంకటరమణ, టి.మనోజ్, శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.